ప్రియాంకా చోప్రా తనదైన నటనతో హిందీ చిత్రపరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, కెరీర్ ఉన్నత దశలో ఉన్నప్పుడు ఆమె బాలీవుడ్‌ను ఎందుకు వదిలేశారన్న ప్రశ్న చాలా కాలంగా వినిపిస్తోంది. ఈ విషయంపై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు."కొందరిని మెప్పించనందుకు.. వారు చెప్పినట్లు చేయనందుకు నా సినిమా అవకాశాలు మరొకరికి ఇచ్చారు. ఇతరులు రాజీ పడినట్లుగా.. వాళ్లకు అనుకూలంగా మారేందుకు నేను ఇష్టపడలేదు. ఈ విషయం గురించి నేను ఎక్కువగా మాట్లాడను. కొందరు అగ్ర హీరోలు నన్ను ఉద్దేశపూర్వకంగా సినిమాల నుంచి తప్పించారు. 2007లో 'సలామ్-ఎ-ఇష్క్' షూటింగ్ సమయంలో నేను మరో సినిమాలో నటించాల్సి ఉంది. ఆ చిత్ర హీరో ఒకరోజు నా సెట్‌కు వచ్చారు. తర్వాత నెలలోనే మా సినిమా షూటింగ్ ప్రారంభం కానుండటంతో.. నాకు మద్దతుగా వచ్చారని అనుకున్నా, కానీ, ఆయన ఊహించని మాట చెప్పారు. 'దర్శకుడు పారపాటున ఈ సినిమా నీకు ఇచ్చారు. నిజానికి ఈ పాత్ర మరో హీరోయిన్ చేయాల్సింది. మనం భవిష్యత్తులో మరో సినిమా చేద్దాం. ఈ విషయం నీకు స్వయంగా చెబుదామనే వచ్చా' అని చెప్పారు. ఇలా ఒకసారి కాదు.. చాలాసార్లు జరిగింది. ఆ పరిస్థితుల్లో నా కెరీర్ గురించి ఆలోచించాను. నా నటనపైనే పూర్తి దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నాను. నా కష్టమే నా కెరీర్‌ను నిలబెట్టి, మరిన్ని అవకాశాలు తెచ్చిపెట్టింది" అని ప్రియాంక గుర్తుచేసుకున్నారు.

బాలీవుడ్ నుంచి వెళ్లిపోవడానికి కారణమిదే: ప్రియాంక

డైరెక్టర్ నుంచి హీరోగా... లోకేశ్ కొత్త అవతారం!

తమిళ దర్శకుడు లోకేష్ కనగరాజ్ గురించి ఈ ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎంతో మంది తమిళ స్టార్ హీరోలతో సినిమాలు చేసి... బంపర్ హిట్లు అందుకున్నారు. తెలుగులో రాజమౌళి ఎలా ఇండస్ట్రీని రూల్ చేస్తున్నారో... అచ్చం అలాగే తమిళ ఇండస్ట్రీని దున్నేస్తున్నారు. అయితే అలాంటి దమ్మున్న దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఇప్పుడు హీరోగా మారిపోయారు. ఆయన తొలిసారిగా లీడ్ రోల్ చేసిన మూవీ డీసీ. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో హీరోగా లోకేష్ కనిపించనుండగా... వామికా గబ్బి హీరోయిన్ గా మెరువనున్నారు. అయితే ఈ సినిమా నుంచి లేటెస్ట్ గా ట్రైలర్ రిలీజ్ అయింది. ఈ సినిమాలో దేవదాస్ గా లోకేష్ కనగరాజ్ కనిపించగా... హీరోయిన్ వామికా చంద్ర అనే యువతి పాత్రలో కనిపిస్తారు. ఇక ఈ చంద్రకు సపోర్ట్ గా నిలుస్తూ దేవదాసు చేసే పనులను ఈ సినిమాలో చాలా చక్కగా చూపించినట్లు తెలుస్తోంది. అటు విజువల్స్ తో పాటు అనిరుధ్ మ్యూజిక్ కూడా ట్రైలర్ కు హైప్ తీసుకొచ్చింది.

ఆ బయోపిక్ నుంచి వైదొలగిన ఆమిర్ ఖాన్!

పారిశ్రామికవేత్త అమ్నీర్ గ్రోవర్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్ నుంచి బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ వైదొలిగినట్లు తెలుస్తోంది. దర్శకుడు రాహుల్ మోదీతో తలెత్తిన విభేదాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. స్టార్టప్‌ల ప్రపంచంపై ఉన్న ఆసక్తితో అమిర్ ఈ సినిమాను ఓకే చేశారని.. స్క్రిప్ట్ వర్క్‌లో కూడా పాల్గొన్నారని సమాచారం. కథ విషయంలో దర్శకుడితో విభేదాలు రావడంతో దీని నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నారని తెలుస్తోంది. అయితే, దీనిపై ఆమిర్ ఇప్పటివరకూ స్పందించలేదు. మరోవైపు, ఆమిర్ వైదొలగడంతో మరో హీరోను ఎంపిక చేసేందుకు మేకర్స్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బాలీవుడ్‌లోని కొందరు హీరోలతోనూ చర్చలు జరిపారని సమాచారం. త్వరలోనే కొత్త హీరోను అధికారికంగా ప్రకటిస్తారని టాక్. ఈ బయోపిక్‌లో 'భారత్‌పే' సహ వ్యవస్థాకుడిగా అమ్నీర్ ప్రయాణాన్ని, పాపులర్ రియాలిటీ టీవీ షో 'షార్క్ ట్యాంక్ ఇండియా' మొదటి సీజన్ న్యాయనిర్ణేతగా ఆయకు వచ్చిన గుర్తింపును చూపనున్నారు. అమ్నీర్ భార్య మాధురి జైన్ పాత్రలో శ్రద్ధా కపూర్ నటించనున్నట్లు తెలుస్తోంది.

'విశ్వనాథ్ అండ్ సన్స్' సెకండ్ సింగిల్‌కు ముహూర్తం ఫిక్స్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ మూవీ 'విశ్వనాథ్ అండ్ సన్స్'. విభిన్నమైన ప్రేమకథగా తెరకెక్కిన ఈ చిత్రం ఆగస్టు 14న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాబోతుంది. దీంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచిన మేకర్స్ ఇప్పటికే మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేసి.. ఫస్ట్ సాంగ్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. 'నేనో బటర్‌ఫ్లై' అంటూ సాగే ఈ సాంగ్ చాట్ బాస్టర్ హిట్‌గా నిలిచింది. అంతే కాకుండా.. ఇప్పటికీ నెట్టింట ట్రెండ్ అవుతూ అత్యధిక వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇప్పుడు ఇదే జోష్‌తో తాజాగా సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ ఈ నెల 25న రాబోతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా.. సూర్య ఫుల్ జోష్‌లో డ్యాన్స్ చేస్తున్న ఓ పోస్టర్ షేర్ చేసి ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేశారు. కాగా.. 'ప్రేమలు' బ్యూటీ మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

ఆ నిందితులపైనే నా పోరాటం 'అమ్మ' అధ్యక్షురాలు శ్వేతా మేనన్

మలయాళ చిత్రసీమను కుదిపేస్తోన్న హేమా కమిటీ నివేదిక వివాదంపై 'అమ్మ' (అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్షురాలు, నటి శ్వేతా మేనన్ స్పందించారు. తన పోరాటం కేవలం హేమా కమిటీ నివేదికలో లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న 'పవర్ గ్రూప్' పైనేనని ఆమె స్పష్టం చేశారు. అటువంటి వారు తమ సంఘానికి నాయకత్వం వహించకుండా చివరి వరకు పోరాడతానని తేల్చిచెప్పారు. "గతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొందరు నన్ను తీవ్రంగా అవమానించి బయటకు పంపేందుకు ప్రయత్నించారు. నేను ఈ పదవిలో ఉన్నంత కాలం . హేమా కమిటీ నివేదికలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటోన్న ఏ ఒక్కరినీ 'అమ్మ' సంఘం బాధ్యతల్లోకి రానివ్వను. దానికోసం ఎలాంటి నిర్ణయానికైనా వెనుకాడను. ఈ ఆరోపణలు ఎదుర్కొంటోన్న వారిలో కొందరి ఆర్థిక అక్రమాలపై నేను ప్రశ్నలు లేవనెత్తినప్పుడు.. వాటికి సమాధానాలు చెప్పకుండా నాపై వ్యక్తిగత నిందలు వేయడం ప్రారంభించారు. బాధితుల పక్షాన నిలబడేందుకే నా పోరాటం. పబ్లిసిటీ కోసమో, వ్యక్తిగత ప్రయోజనాల కోసమో నేను ఈ పోరాటం చేయడం లేదు" అని స్పష్టం చేశారు. తన రాజకీయ అనుబంధాలపై, నిధుల వ్యవహారంపై వస్తోన్న ఆరోపణలను కూడా ఆమె తీవ్రంగా ఖండించారు. "కేరళలో అభ్యర్థులను వెతికిపెట్టడానికి ఒక జాతీయ పార్టీ నాకు కోట్ల రూపాయలు ఇచ్చిందనడం పూర్తిగా హాస్యాస్పదం. ఏదైనా రాజకీయ పార్టీతో అనుబంధం ఉంటే దాన్ని దాచాల్సిన అవసరం నాకేంటి?. ఇలాంటి ఆరోపణలు చేస్తూ నన్ను ఎవరూ భయపెట్టలేరు. సత్యం గెలవాలన్నదే నా లక్ష్యం. 'అమ్మ' సంఘానికి మంచి రోజులు రావాలి" అని శ్వేత అన్నారు. 'అమ్మ' అధ్యక్ష పదవికి చేసిన రాజీనామాను ఉపసంహరించుకున్న శ్వేతా మేనన్.. కోర్టు స్టేతో తన బాధ్యతల్లో కొనసాగుతున్నారు.

చైనా ఓపెన్‌లో సింధు శుభారంభం..

విశ్వంభర, స్పోర్ట్స్: జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచి జోరు మీదున్న భారత స్టార్ పి.వి.సింధు చైనా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేసింది. బుధవారం మహిళ సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత టీనేజీ సంచలనం ఉన్నతి హుడాపై 21-14, 9-21, 21-10 తేడాతో సింధు విజయం సాధించి ప్రి క్వార్టర్స్‌కు (రౌండ్ ఆఫ్ 16) చేరుకుంది. జపాన్ ఓపెన్‌లో విజయంతో రెండేళ్ల టైటిల్ కరవును తీర్చుకున్న సింధుకు ఈ మ్యాచ్‌లో ఉన్నతి నుంచి గట్టి పోటీ ఎదురైంది. 56 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో తొలి గేమ్ ఆరంభంలో సింధుకు ఉన్నతి హుడా దీటుగా బదులిచ్చి 7-7తో నిలిచింది. తర్వాత రిథమ్ అందుకున్న సింధు వరుసగా పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకుంది.రెండో గేమ్‌లో ఉన్నతి దూకుడు ప్రదర్శించగా.. ప్రపంచ మాజీ ఛాంపియన్ గట్టిపోటీ కూడా ఇవ్వలేకపోయింది. 6-3తో ఆధిక్యం సంపాదించిన ఉన్నతి ఆపై మరింత జోరు పెంచి 12-4 తిరుగులేని స్థితిలో నిలిచింది. తర్వాత కూడా పట్టుకోల్పోకుండా 21-9తో విజయం సాధించి మ్యాచ్‌ను సమం చేసింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు ఆధిపత్యంతో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను చేజిక్కించుకుంది. రౌండ్ ఆఫ్ 16లో నాలుగో సీడ్, చెన్ యుఫై (చైనా)తో తలపడనుంది. ఇటీవల జపాన్ ఓపెన్ సెమీఫైనల్స్‌లో చెన్ యుఫైను సింధు వరుస గేమ్‌లలో ఓడించింది. మరోవైపు.. పురుషుల సింగిల్స్‌లో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి తొలి రౌండ్‌లో సంచలన విజయాన్ని నమోదు చేశాడు. 57 నిమిషాల పాటు సాగిన ఉత్కంఠభరితమైన పోరులో ప్రపంచ 11వ ర్యాంకర్, ఇండోనేసియాకు చెందిన అల్వి ఫర్హాన్‌ను 17-21, 21-5, 21-17 తేడాతో ఓడించాడు.

విమర్శలకు కుంగిపోవద్దు.. నిర్భయంగా ఆడండి: శ్రేయస్ అయ్యర్

విశ్వంభర, స్పోర్ట్స్: బయటి నుంచి వస్తున్న విమర్శలకు కుంగిపోకుండా నిర్భయంగా ఆడాలని భారత ఆటగాళ్లకు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచించాడు. టీమ్‌ఇండియా ఇటీవల ఇంగ్లాండ్, ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ల్లో ఒక్క మ్యాచ్‌లోనూ గెలవలేదు. దీంతో భారత జట్టుపై విమర్శల దాడి ఎక్కువైంది. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా.. జింబాబ్వే పర్యటనకు వెళ్లింది. గురువారం నుంచి భారత్ ఆ జట్టుతో మూడు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. తొలి మ్యాచ్‌కు ముందు కెప్టెన్ శ్రేయస్ మీడియాతో మాట్లాడాడు."ఇంగ్లాండ్ పర్యటనలో మేము కొంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నాం. కానీ, దాని నుంచి చాలా సానుకూల అంశాలు నేర్చుకున్నాం. భవిష్యత్తులో ఒక జట్టుగా మేము ఏం చేయాలి, మైదానంలో అడుగుపెట్టినప్పుడు ఎలాంటి మనోస్థైర్యం కలిగి ఉండాలి అనే విషయాలను తెలుసుకున్నాం. మాలో కొందరు ఇక్కడ మొదటిసారి ఆడుతున్నారు. కాబట్టి మేం పరిస్థితులకు ఎంత త్వరగా అలవాటు పడితే అంత మంచి ఫలితాలను సాధిస్తాం. ఆటగాళ్లు వైఫల్యాల గురించి భయపడొద్దు. ఎందుకంటే మనసులో అలాంటి ఆలోచనలు ఉంటే మిమ్మల్ని మీరు కాపాడుకోవడానికే ఆడతారు. మీకు ఆ భయం లేనప్పుడు మీలోని అత్యుత్తమ ప్రతిభను బయటకు తీసుకొస్తారు. బయట జనాలు ఏమంటున్నారనే దాని గురించి ఎక్కువగా ఆలోచించాల్సిన అవసరం లేదు. మనం వర్తమానంలో ఉండాలి. ఒక జట్టుగా కలిసికట్టుగా ఎంత మంచి క్రికెట్ ఆడితే అదే స్థాయిలో ఫలితం వస్తుంది. మేం ఇంగ్లాండ్ నుంచి నిన్నే వచ్చాం. ఈ రోజు ప్రాక్టీస్ సెషన్. రేపు మ్యాచ్. ఇది చాలా సవాలుతో కూడుకున్నది. ఇలాంటి పరిస్థితుల్లో రాణిస్తే ఆ ఫీలింగ్ చాలా బాగుంటుంది. గత సిరీస్‌ల్లో ఫలితాలు మాకు అనుకూలంగా రాలేదు. కానీ, అది జట్టు సభ్యులను మరింత దగ్గర చేసింది. ఇకపై ఒక జట్టుగా ఎలా ఆడాలనే దానిపై చర్చలు జరుపుతున్నాం" అని శ్రేయస్ వివరించాడు.

యార్క్‌షైర్‌తో కుల్‌దీప్ యాదవ్ ఒప్పందం

విశ్వంభర, స్పోర్ట్స్: ఇటీవల ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో మణికట్టు స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ అన్ని మ్యాచ్‌ల్లోనూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. జింబాబ్వేతో జరగబోయే టీ20 సిరీస్‌కు కూడా అతడిని ఎంపిక చేయలేదు. దీంతో కుల్‌దీప్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. కౌంటీ ఛాంపియన్‌షిప్ టీమ్ యార్క్‌షైర్‌తో అతను ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న వన్డే కప్‌లో ఐదు మ్యాచ్‌లు, సెప్టెంబర్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో మూడు మ్యాచ్‌లు ఆడనున్నాడు. ఇంగ్లాండ్‌లో ఉన్న కుల్‌దీప్ యార్క్‌షైర్ జట్టుతో కలిశాడు.శుక్రవారం గ్లామోర్గాన్‌తో జరిగే మ్యాచ్‌కు ఈ స్పిన్నర్ అందుబాటులో ఉంటాడు. అతను ఇంగ్లాండ్‌లో దేశవాళీ క్రికెట్ ఆడటం ఇదే తొలిసారి. యార్క్‌షైర్ తరఫున గతంలో సచిన్ తెందూల్కర్, యువరాజ్ సింగ్ కూడా ఆడారు. "యార్క్‌షైర్ జట్టులో చేరడం నాకు చాలా సంతోషంగా ఉంది. గొప్ప చరిత్ర కలిగిన ఈ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించడం నిజంగా ఒక గౌరవం. ఇక్కడి వాతావరణ పరిస్థితుల్లో ఆడటంలోని సవాలును ఎప్పుడూ ఆస్వాదిస్తుంటాను. యాజమాన్యంతో మాట్లాడిన తర్వాత జట్టులో చేరడానికి ఎంతో ఉత్సాహంగా ఉన్నాను" అని కుల్‌దీప్ పేర్కొన్నాడు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com